2న శాంతిసరోవర్‌లో దసరా వేడుకలు

రాయదుర్గం: దసరా పర్వదినాన్ని పురస్కరించుకొని బ్రహ్మకుమారీస్‌ సంస్థ ఆధ్వర్యంలో గచ్చిబౌలి శాంతిసరోవర్‌లో వేడుకలను నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. గురువారం సాయంత్రం 6 గంటలకు వేడుకలను ప్రారంభిస్తారు. రావణ దహనం, బతుకమ్మ వేడుకలు, గార్బా, దాండియా రాస్‌ నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. మరిన్ని వివరాలకు ఫోన్‌ నంబర్‌ 040–23001234లో సంప్రదించాలని నిర్వాహకులు తెలిపారు.

పీహెచ్‌డీ ప్రదానం

రాయదుర్గం: మనూ పరిశోధక విద్యార్థికి పీహెచ్‌డీ డిగ్రీని ప్రకటించారు. ఉర్దూ విశ్వవిద్యాలయంలోని జర్నలిజం అండ్‌ మాస్‌ కమ్యూనికేషన్‌ విభాగంలో ప్రొఫెసర్‌ మహ్మద్‌ ఫరియాద్‌ పర్యవేక్షణలో 'హైదరాబాద్‌ నుంచి ప్రచురించబడిన ఎంపిక చేసిన ఉర్దూ, ఆంగ్ల వార్తాపత్రికల్లో అభివృద్ధి వార్తల తులనాత్మక విశ్లేషణ' అనే అంశంపై ఇచ్చిన థీసిస్‌ను పరిశీలించి పీహెచ్‌డీని ప్రకటించారు.

గ్లోబల్‌ ఎంటర్‌టైన్‌మెంట్‌ హబ్‌గా నిలబెట్టడమే లక్ష్యం



సమావేశంలో పాల్గొన్న చైర్మన్‌ డా.విమల్‌రాజ్‌ మాథుర్‌ తదితరులు

మాదాపూర్‌: భారత్‌ను గ్లోబల్‌ ఎంటర్‌టైన్‌మెంట్‌ హబ్‌గా నిలబెట్టడమే లక్ష్యమని గ్రేడియెంటీ ఇన్ఫోటైన్‌మెంట్‌ చైర్మన్‌ డాక్టర్‌ విమల్‌రాజ్‌ మాథుర్‌ తెలిపారు. మాదాపూర్‌లోని తమ కార్యాలయంలో మంగళవారం వార్షిక బోర్డు సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాబోయే మూడు సంవత్సరాలలో భారత సృజనాత్మకత ఆర్థిక వ్యవస్థను చేయడం, ఉత్తర ఆఫ్రికా మార్కెట్లో విస్తరించడం లక్ష్యంగా పెట్టుకున్నట్టు తెలిపారు. ప్రధానమంత్రి నరేంద్రమోదీ ఆరెంజ్‌ ఎకానమీ రోడ్‌ మ్యాప్‌ ప్రేరణతో ఈ నిర్ణయం తీసుకున్నామని ఆయన తెలిపారు.



దుర్గాదేవిగా అన్నపూర్ణాదేవి



మధురానగర్‌లో..



ఎల్లమ్మ ఆలయంలో..



ఊరపోచమ్మ అమ్మవారు

దుర్గాదేవి నమోస్తుతే



ఊరపోచమ్మను దర్శించుకున్న భక్తులు

శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా మంగళవారం అమ్మవారు దుర్గాదేవిగా దర్శనమిచ్చారు. అలాగే మండపాల వద్ద ప్రతిష్టించిన అమ్మవార్లకు అర్చనలు, ప్రత్యేక పూజలు, సామూహిక కుంకుమార్చన, పారాయణాలు చేశారు. గచ్చిబౌలి శివసాయిక్షేత్రంలో చండీ హోమం, పూర్ణాహుతి నిర్వహించారు. రాయదుర్గంలోని మండపం వద్ద కూచిపూడి, భరతనాట్య ప్రదర్శన చేశారు. పెద్ద సంఖ్యలో భక్తులు అమ్మవార్లను దర్శించుకున్నారు.

–శేరిలింగంపల్లి జోన్‌బృందం



పాపిరెడ్డికాలనీలో.. కార్పొరేటర్‌ రాగం నాగేందర్‌యాదవ్‌



రాయదుర్గంలోని మండపం వద్ద పూజలు



శేరిలింగంపల్లిలో..

సకాలంలో వ్యాధిని గుర్తించడం అవసరం

డాక్టర్‌ లోకేశ్వరరావు

రాయదుర్గం: ప్రత్యేక కార్డియాక్‌ కేంద్రాలలో సకాలంలో శస్త్రచికిత్స చేయడం ద్వారా ప్రాణాలు కాపాడబడతాయని స్టార్‌ ఆస్పత్రి కార్డియోథొరాసిక్‌ సర్జన్‌, సజ్జ హార్ట్‌ ఫౌండేషన్‌ చైర్మన్‌ డాక్టర్‌ లోకేశ్వరరావు తెలిపారు. దేశవ్యాప్తంగా అధునాతన శస్త్రచికిత్స పద్ధతులను అవలంబిస్తుండగా, పరిమిత సౌకర్యాలున్న చోట రోగ నిర్ధారణ ఆలస్యంగా జరుగుతుందని జాతీయ సర్వేలో గుర్తించారన్నారు. మంగళవారం ఆయన సర్వే వివరాలను వెల్లడించారు. భారతదేశం అంతటా అక్యూట్‌ టైప్‌–ఏ ఆరిక్‌ డిసెక్షన్‌ కేసులకు చికిత్స అందించడంలో గణనీయమైన తేడాలు ఉన్నట్లు సర్వేలో తేలిందన్నారు. సజ్జ హార్ట్‌ ఫౌండేషన్‌ చైర్మన్‌ డాక్టర్‌ లోకేశ్వరరావు చేసిన జాతీయ స్థాయి సర్వే 'ఇండియన్‌ జర్నల్‌ ఆఫ్‌ థొరాసిక్‌ అండ్‌ కార్డియోవాస్కులర్‌ సర్జరీ–2025' ప్రచురితమైంది. నిశ్శబ్దంగా సంభవించే అత్యంత ప్రమాదకరమైన 'ఎవోర్టిక్‌ డిసెక్షన్‌' అనేది చాలా అరుదుగా వస్తుందని ఆయన ఈ సందర్భంగా వివరించారు. దీనిపై ప్రజల్లో అవగాహన పెంచడం, వైద్యులు సకాలంలో వ్యాధిని గుర్తించడం కూడా అత్యంత అవసరమని సర్వే స్పష్టం చేసిందని డాక్టర్‌ వివరించారు.

జోనల్‌ కమిషనర్‌కు వినతి

పటాన్‌చెరు టౌన్‌: డివిజన్‌ పరిధిలో సీసీ రోడ్ల నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని కార్పొరేటర్‌ మెట్టుకుమార్‌ యాదవ్‌ అన్నారు. మంగళవారం జోనల్‌ కమిషనర్‌ కార్యాలయంలో జోనల్‌ కమిషనర్‌ హేమంత్‌ను కార్పొరేటర్‌ కలిసి పటాన్‌చెరు డివిజన్‌లో సీసీ రోడ్ల నిర్మాణానికి అవసరమైన నిధులు మంజూరు చేయాలని వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా కార్పొరేటర్‌ మాట్లాడుతూ... శాంతినగర్‌, శ్రీనగర్‌, ఆల్విన్‌ కాలనీ, బండ్లగూడ, సాయిరాం నగర్‌ కాలనీలలో రోడ్లు దుస్థితికి చేరాయని ప్రజలు తీవ్ర ఇబ్బందులుపడుతున్నారని పేర్కొన్నారు. తక్షణమే నిధులు మంజూరు చేయాలని కోరామన్నారు.

ప్రతి ఒక్కరు మొక్కలు పెంచాలి



క్యాంపస్‌లో మొక్క నాటుతున్న ఈడీ డా.తేజ్‌లోహిత్‌రెడ్డి

రాయదుర్గం: ప్రతి ఒక్కరూ మొక్కలు పెంచాలని, భవిష్యత్‌ తరాలకు స్వచ్ఛమైన గాలి లభించేలా చూడాలని ఎఫ్‌డీడీఐ–హైదరాబాద్‌ ఎగ్జిక్యూటివ్‌ డైరెక్టర్‌ డాక్టర్‌ ఎస్‌.తేజ్‌ లోహిత్‌రెడ్డి అభిప్రాయపడ్డారు. రాయదుర్గంలోని ఎఫ్‌డీడీఐ–హైదరాబాద్‌ క్యాంపస్‌లో సోషల్‌ అండ్‌ ఎన్విరాన్‌మెంట్‌ క్లబ్‌ ఆధ్వర్యంలో స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమంలో భాగంగా 'ప్లాంటేషన్‌ డ్రైవ్‌' కార్యక్రమంలో మొక్కలు నాటి ప్రారంభించారు. అనంతరం క్యాంపస్‌లో ఎఫ్‌డీడీఐ ఫ్యాకల్టీ, అధికారులు, ఉద్యోగులు, విద్యార్థులు మొక్కలు నాటారు. కార్యక్రమంలో ఎఫ్‌డీడీఐ ఫ్యాకల్టీ డాక్టర్‌ రాంబాబు ముప్పిడి, అమిత్‌పూరి గోస్వామి, సందీప్‌మిశ్రా, రిన్సి, బిందు, ఫియాజీతో పాటు ముష్కన్‌, సాన్వి, భవ్య, యుక్తిక, సామాజిక, పర్యావరణ క్లబ్‌ సభ్యులు, విద్యార్థులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

జానపద నృత్యోత్సవం



మాదాపూర్‌: శిల్పారామంలో నిర్వహిస్తున్న దసరా ఉత్సవాలలో భాగంగా మంగళవారం శిల్పారామం, సౌత్‌ సెంట్రల్‌జోన్‌ కల్చరల్‌ సెంటర్‌ నాగ్‌పూర్‌ సంయుక్త నిర్వహణలో లోక్‌ కళాయాత్ర జానపద నృత్యోత్సవం అలరించింది. తెలంగాణ కోలాటం, జమ్మూ డోంగ్రి నృత్యం, పంజాబ్‌ బాంగ్రా నృత్యం, ఛత్తీస్‌గఢ్‌ గెడి నృత్యం, మహారాష్ట్ర సొంగిముఖవాటే, మాస్క్‌ డ్యాన్స్‌ నృత్యాలు అలరించాయి. అలాగే రమాదేవి శిష్యబృందం కూచిపూడి నృత్యప్రదర్శనలో భాగంగా మామవతుశ్రీ సరస్వతి, అందముగా, హిరణ్మయి లక్ష్మి, కృష్ణజనన శబ్దం, అలివేలుమంగ, భో శంభో అంశాలను కళాకారులు నిషిక, ప్రేరణ, శ్రీజ, ధనుష్య, దివ్య, హర్షిని, మానస, సురేఖ, మధులిక, షణ్ముఖప్రియ పల్లవి, శ్లోక ప్రదర్శించారు.

అలరించిన స్వరలహరి

అన్నమయ్యపురంలో నిర్వహిస్తున్న నాదబ్రహ్మోత్సవ్‌– 2025లో భాగంగా మంగళవారం సాందీప్‌ స్వరలహరి వీనులవిందుగా సాగింది. శోడశ కలల, కొండలలో నెలకొన్న, చాలదా, దాచుకో, నీపాదాలకు, జగదంబే సాయిమాత, అనే సంకీర్తనలను ఆలపించారు. కీబోర్డు రాజు, తబలా అజయ్‌ వాయిద్య సహకారాన్ని అందించారు. కార్యక్రమంలో శాంతబయోటిక్స్‌ వ్యవస్థాపకులు కె.ఐ వరప్రసాద్‌రెడ్డి, , ఫార్చ్యూన్‌ 500 సీనియర్‌ ఎగ్జిక్యూటివ్‌ కిరణ్మయి ప్రసంగించారు. పద్మశ్రీ డాక్టర్‌ శోభారాజు కళాకారులను సత్కరించారు.

గ్రూప్‌–బీలో సత్తా చాటిన 'మనూ' విద్యార్థులు



ఎండీ.నజీర్‌



చందూరి వంశీకృష్ణ

రాయదుర్గం: మనూలోని సివిల్‌ సర్వీసెస్‌ ఎగ్జామినేషన్‌(సీఎస్‌ఈ) రెసిడెన్షియల్‌ కోచింగ్‌ అకాడమీలో శిక్షణ పొందుతున్న ఇద్దరు విద్యార్థులు సత్తా చాటారు. తెలంగాణ రాష్ట్ర పబ్లిక్‌ సర్వీస్‌ కమిషన్‌ నిర్వహించిన గ్రూప్‌–బి పరీక్షల్లో రాణించారు. సీఎస్‌ఈ–ఆర్‌సీఏ డైరెక్టర్‌ ప్రొఫెసర్‌ హెచ్‌ అలీమ్‌ భాష తెలిపిన వివరాల ప్రకారం.. ఎం.డీ.నజీర్‌ అసిస్టెంట్‌ రిజిస్ట్రార్‌ ఉద్యోగానికి, చందూరి వంశీకృష్ణ తహసీల్దార్‌ ఉద్యోగానికి ఎంపికయ్యారని ఆయన వివరించారు.

దుస్తుల పంపిణీ

పటాన్‌చెరు: దసరా పండుగ నేపథ్యంలో ఎండీఆర్‌ ఫౌండేషన్‌ చైర్మన్‌ పృథ్వీరాజ్‌ ఆధ్వర్యంలో మంగళవారం ఆశా వర్కర్లకు ,అర్చకులకు దుస్తులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా పృథ్వీరాజ్‌ మాట్లాడుతూ దసరా పండుగను సంతోషంగా జరుపుకోవాలని తమ వంతు సహకారం అందించామన్నారు. కార్యక్రమంలో ఫౌండేషన్‌ అధ్యక్షుడు మధు, ఆశ వర్కర్లు ,అర్చకులు పాల్గొన్నారు.